# మేడిపండు

చంద్రావుకి 'సామాజిక స్పృహ' ఉన్న రచయితగా సొసైటీలో మంచి పేరుంది. రిక్షా కార్మికుల జీవితాలను వెలుగులోకి తెస్తూ అతను రాసిన కథకు, ఓ ప్రముఖ వార పత్రిక నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. వరకట్న దురాచారాన్ని దుయ్యబ డుతూ అతను రాసిన నవల మంచి 'హిట్' అయ్యింది. దాంతో చంద్రావు ఒక 'యిమేజ్' ఉన్న రచయితగా పాఠకుల్లో 'క్లిక్' అయ్యాడు.

వేశ్యల జీవితాలపై ఒక సమగ్ర పరిశోధనాత్మక నవల రాయాలన్నది చంద్రావు ప్రస్తుత ఆలోచన. అందుకవసరమైన 'మేటర్' సేకరించడానికి సిటీలో పేరుపడ్డ అండాళమ్మ కంపెనీకి వెళ్ళాడు ఓ సాయంత్రం. అక్క



డున్న అమ్మాయిల్లో కంటికి కాస్త నదురుగా కనిపించినామెను 'సెలెక్ట్' వేసుకొని గదిలోకి తీసుకు పోయాడు.

ఆమెను మంచం మీద కూర్చోమని చెప్పి, తాను అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. "చూడండి! నా పేరు చంచలరావు! నేనో రచయితని. వేశ్యల జీవితాలపై ఓ నవల రాయాలనుకుంటున్నాను. దయచేసి మీరు యీ రొంపిలో ఎలా యిరుక్కున్నారో వివరంగా చెప్పండి. అది నాకెంతో ఉపయోగ పడుతుంది" అన్నాడు.

"ఓ. చంద్రావుగారంటే మీరేనా! నాలుగయిదుసార్లు పత్రికల్లో మీ పేరు చూశానండి!" అందామె చిన్నగా నవ్వుతూ.

"ఐసీ! అయితే మీరు చదువుకున్న వారన్నమాట!"

"యస్. నేను ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాను. నా పేరు శాంతి. మా క్లాస్‌మేట్ 'కాళిదాస్' అని ఒకతనుండేవాడు. అతనూ, నేనూ ప్రేమించుకున్నాం. పెద్దలు మా పెళ్ళికి అంగీకరించరనీ, అందుకే ఎక్కడికైనా దూరంగా పారిపోయి ఆనందంగా బ్రతుకుదామనీ నాలో ఆశలు రేపాడు. అతని తియ్యని కబుర్లకి లొంగిపోయి, మా బీరువాలో ఉన్న నగలు, డబ్బు అన్నీ ఓ బ్రీఫ్‌కేస్‌లో సర్దుకొని రాత్రికి రాత్రే అతనితో పారిపోయి యీ ఊరొచ్చేశాను. రెండు నెలలపాటు హాయిగా ఒక హోటల్‌లో గడిపి, స్వర్గ సుఖాలు చవిచూశాం. ఆ తరువాత— కట్టుకునేందుకొక గుడ్డ ముక్క కూడా మిగల్చకుండా బ్రీఫ్‌కేస్‌తో డబ్బంతా తీసుకొని ఉడాయించాడా రాస్కెల్ కాళిదాసు.

ఒంటరిగా ఏడుస్తున్న నన్ను ఓ పట్టు లాల్చీ పెద్ద మనిషి ఓదార్చాడు. నా కథ విన్నాడు. కన్నీళ్లు తుడిచాడు. మళ్ళీ మా వాళ్ల దగ్గరకు చేర్చేదాకా, తన యింట్లో ఉండమన్నాడు. కసాయివాడి మాటలు నమ్మిన గొర్రె పిల్లలాగా, ఆయన వెంట వెళ్ళాను. ఆ యింట్లో— నా కంటె రెండు రెట్లు ఎక్కువ వయసున్న ఆ దుర్మార్గుడు నన్ను రాక్షసంగా చెరిచాడు. తరువాత — రెండున్నర వేల రూపాయలకు నన్ను ఈ అండాళమ్మ కంపెనీకి అమ్మేశాడు. అప్పటి నుండీ నా బ్రతుకు యిలా సాగిపోతోంది. ఈ మురికి కూపం నుండి తప్పించుకొని పారిపోవడానికి ఒకటి రెండు సార్లు ప్రయత్నం చేశాను. కానీ వీలుపడలేదు. అండాళమ్మ పోషించే గూండాలు నన్ను వావబాదారు"— అంటూ ముగించింది శాంతి.

"బ్లడీ స్కౌండ్రల్స్! అలాంటి మేక వన్నె పులుల వల్లనే, నీలాంటి అమాయకమైన ఆడపిల్లలు వెలియాలులుగా తయారవుతున్నారు. అటువంటి నీచుల జీవితాన్ని బయటపెట్టాలి. సమాజం చేత వాళ్ళ మొహాలపై ఖాండ్రించి ఉమ్మించాలి. ఎనీ హౌ, ఇంత వివరంగా నీ కథ చెప్పి, నా నవలకు పునాది వేసినందుకు మెనీ మెనీ థాంక్స్" అంటూ లేచాడు చంచలరావు.

"ఆగండి మిస్టర్ చంచల్రావ్' మీతో నేను అరగంటసేపు మాట్లాడాను. నా రేటు గంటకి నూట యాభై. మీతో మాట్లాడిన కారణంగా నేను డెబ్భై అయిదు రూపాయలు నష్టపోయాను. సో... ఆ డబ్బిచ్చి మరీ వెళ్ళండి"— అంది శాంతి.

చంచల్రావు ఆగి, ఆమె ముఖం వంక పరిశీలనగా చూశాడు.

తేనె రంగులో మత్తుగా ఉన్న కళ్ళు, కోటేరు పోసినట్టున్న ముక్కు, లిప్‌స్టిక్ రాసిన ఎర్రని పెదాలు, నునుపైన చెక్కిళ్ళు... షి యీజ్ టోటల్లీ బ్యూటీ.

అతనిలోని మగతనం నిద్రలేచింది.

"ఆల్‌రైట్, మిగిలిన అరగంటా నేను సద్వినియోగం చేసుకుంటాను. ఇదిగో నూట యాభై"— అంటూ జేబులోంచి డబ్బు తీసి ఆమె జాకెట్లో దోపాడు.

అరగంట తరువాత—

డ్రెస్ వేసుకుంటున్న చంచల్రావుని చూసి ఎగతాళిగా నవ్వింది శాంతి.

## గొంటు శ్రీనివాస్

"మిస్టర్ చంచల్రావ్! ఆ రాస్కెల్ కాళిదాస్‌గాడు, ఆ పట్టులాల్చీ దౌర్భాగ్యుడు... నేను వ్యభిచారిణిగా మారడానికి మాత్రమే కారకులైతే, మేడిపండు లాంటి నీవంటి కుహనా సంస్కర్తలే మేమింకా యీ నికృష్టపు వృత్తిలో కొనసాగడానికి కారకులౌతున్నారు. నిజానికి వాళ్ళకంటే మీరే నీచులు.

నీ నిజాయితీని పరీక్షించడానికే నిన్ను డబ్బడిగాను. కానీ— ఆ డబ్బుని వృథాగా నాకివ్వడం యిష్టంలేక, నన్ను అనుభవించి నీ అల్పబుద్ధిని బయట పెట్టుకున్నావు. నైతిక బలం లేని నీవంటి వాడు రచయిత కావడం సమాజానికే తీరని హాని. సో... ఐ హేట్ యూ! నువ్విచ్చిన యీ నూట యాభై రూపాయలు మళ్ళీ నీ జేబులోనే పెట్టేస్తున్నాను. కానీ ఒక్కమాట... మా జీవితాలనుద్ధరించడానికి నువ్వేదో పరిశోధనాత్మక నవల రాస్తున్నానన్నావు. దయచేసి— ఆ పని మాత్రం చేసి, ఆత్మవంచన చేసుకోకు!"

## జనరల్ నాలెడ్జ్

(1) ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సితారా విద్వాంసుడి పేరు?

(2) తెలుగు భాషకు సేవ చేసిన ఆంగ్లేయుని పేరేమి?

(3) 'రామదండు' అను స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పినది ఎవరు?

(4) 'ఆంధ్ర షేక్స్పియర్' బిరుదు ఎవరికి కలదు?

(5) 'యెన్' అన్నది ఏ దేశపు నాణెము?

(6) మధ్యప్రదేశ్‌లో వజ్రాలు దొరికే చోటు పేరు ఏమి?

(7) 'తోడాస్' ఎవరు?

(8) కల్పాక్కం అను విద్యుత్ కేంద్రం వున్న చోటు—

(9) "హెచ్ టి.— 2 అనగా దేని పేరు?

(10) మయూరాక్షి ఎడమ కాలువ వున్న రాష్ట్రం.

జవాబులు

(1) రవిశంకర్ (2) బ్రౌన్ (3) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (4) పానుగంటి లక్ష్మీ నరసింహం (5) జపాన్ (6) పన్నా (7) నీలగిరి కొండ జంతువులు (8) తమిళనాడు (9) శిక్షణ విమానం (10) బీహార్.

నిర్వహణ: నెమలి రామచంద్రరావు

### థ్రిల్

"మీరు తీస్తున్న సినిమాలో హీరో ఆరడుగులు, హీరోయిన్ మూడడుగుల ఎత్తు వున్నారు!... అయినా గానీ ఎవరూ గమనించలేరు, ఎలా?" అడిగాడు విలేకరి, నిర్మాతతో.

"మరి!... ఫస్టాఫ్‌లో హీరోనూ, సెకండాఫ్‌లో హీరోయిన్నూ చూపిస్తాం!... ఇద్దరూ కలిసి కన్పించే అవకాశమే లేదు కదా మరి..." చెప్పాడు నిర్మాత.

— శ్రీకర్. ఎం